క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ జానకీరాం

ఆత్మకూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓలు జానకీరాం , సురేష్, హెచ్ఎం నాగరాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం క్రీడా ఎంపిక పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించి, మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలన్నారు. 500 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు బుధవారం కూడా కొనసాగనున్నాయి. కార్యక్రమంలో పీడీ దేవానందం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజు



భూమిపూజ చేస్తున్న సయ్యద్‌మీర్

ఆత్మకూరు: పట్టణంలోని 6వ వార్డులో మహబూబ్ మసీదు వద్ద మంగళవారం నూతన సీసీ రోడ్డుకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఈ కాలనీలో పర్యటించిన సమయంలో సీసీ వేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈమేరకు రోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

సాధనతోనే సత్ఫలితాలు

మిడుతూరు: సాధనతోనే సత్ఫలితాలు వస్తాయని ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీధర్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా సాధన చేయించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని చెప్పారు. ప్రతి మంగళవారం నిర్వహించే క్యాంపు దివ్యాంగుల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు మియ్యాబాషా, షహనాజ్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి

నందికొట్కూరు: డ్రైవింగ్ వచ్చే ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో వేలాది మంది డ్రైవర్లు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే పనులలో స్థానిక డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమేష్, డ్రైవర్ల సంఘం నాయకులు నగేష్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యులు విజయేంద్ర, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. మంగళవారం శివపురం అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఇవి రక్తం పెరగడంలో ఎంతో తోడ్పాటునిస్తాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుంకమ్మ, ఏఎన్ఎం నాగమ్మ, రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి హజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా ఎస్ఐ బదిలీ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎస్ఐ వెంకటసుబ్బయ్యను బదిలీచేస్తూ మంగళవారం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మిడుతూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మారుతిశంకర్‌ను నియమించారు. కాగా ఎస్ఐ వెంకటసుబ్బయ్యను నందికొట్కూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్ఐ జగన్‌మోహన్‌ను మిడుతూరు ఎస్ఐగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పాములపాడు: మండలంలో ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. ఈ నెల 30న తుమ్మలూరు, అక్టోబర్ 3న చెలిమిల్ల, 4న జూటూరు, 5న ఇస్కాల, 6న రుద్రవరం, 7న వేంపెంట, 10న భానుముక్కల, 11న మిట్టకందాల, 12న మద్దూరు, 13న బానకచెర్ల, 16న యర్రగూడూరు, 17న వానాల గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు

● మండలస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు ప్రారంభం





పగిద్యాలలో రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, జూపాడుబంగ్లాలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సువర్ణమ్మ

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీపీ సువర్ణమ్మ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ శ్రీనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను మండల క్రీడల కోఆర్డినేటర్ శ్రీనివాసులు అధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచ్ మొట్టిబాలస్వామి రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. పీఈటీ శ్రీనివాసులు, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మిడుతూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీతో పాటు గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ, ఎంఈఓ-2 శ్రీనాథ్, పాఠశాల హెచ్ఎం సాయి తిమ్మయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, చెరుకుచెర్ల హెచ్ఎం ఉమాశంకర్ రావు, క్రీడ సమన్వయకర్త వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ఎంపిక పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

పగిద్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పుల్యాల దివ్య సూచించారు. మంగళవారం హెచ్ఎం మధుసూదన్‌రావు అధ్యక్షతన ఎంపిక పోటీలను జెడ్పీటీసీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో ఆర్డినేటర్ కృష్ణ, కార్యదర్శి శ్రీనాథ్, పీడీలు చందు, వెంకటేశ్వర్లు, రాగన్న, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న తదితరులు పాల్గొన్నారు.



మిడుతూరులో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ జయలక్ష్మమ్మ



కబడ్డీ ఆడుతున్న జూపాడుబంగ్లా తహసీల్దార్ పుల్లయ్యయాదవ్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

మహానంది: క్రీడల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభించారు. సర్పంచులు కల్లె శ్రీలక్ష్మీ, శవ్వా శ్రీలక్ష్మీ, ఎంపీటీసీ పిట్టల సునీత, ఎంపీడీఓ శివనాగజ్యోతి ఆధ్వర్యంలో క్రీడాపోటీలు ప్రారంభించారు.

విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనండి

కొత్తపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులు ఈ నెల 14 నుంచి జరిగే మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలలో చురుగ్గా పాల్గొనాలని హెచ్ఎం సుబ్బారెడ్డి, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ మురళి నాయక్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అండర్ 14, 17 విభాగాలకు మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపికపోటీలు జరపుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీలు ఎం చంద్రశేఖర్, సుంకన్న నాయక్, స్వప్న, రినా బేగం పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

పాములపాడు: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ మండల సమన్వయకర్త పీఈటీ నాగరాజు తెలిపారు. ఈ నెల 13 నుంచి ఈ పోటీలు జరుగనున్న నేపథ్యంలో స్థానిక ఏఎస్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా కోర్టులను ఏర్పాటు చేశారు. పీఈటీలు రాజశేఖర్, సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక పేదలకు వరం



పింఛన్ పంపిణీ చేస్తున్న నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



ఆత్మకూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టి వైఎస్సార్ పింఛన్ కానుక పేదలకు వరమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలోని 16, 17 వార్డులలో కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి చైర్మన్, కౌన్సిలర్లు నగదు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వం అర్హతలున్న వారందరికీ పింఛన్ మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అబ్దుల్ రవూఫ్, లాలు ప్రసాద్, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు.

నూతన పింఛన్ల మంజూరు

మహానంది: మహానంది మండలంలో రెండో విడతలో 114 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు.అలాగే బండిఆత్మకూరు మండలంలో రెండవ విడతలో 166 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త వెల్లడించారు. వీరికి బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



బోయిలకుంట్ల చౌరస్తా వద్ద వేసిన స్పీడ్ బ్రేకర్లు

మహానంది: బోయిలకుంట్ల మెట్ట వద్ద చౌరస్తాలో ఆర్ అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. బోయిలకుంట్ల మెట్ట వద్ద చౌరస్తాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. స్పీడ్ బ్రేకర్లు, సూచికలు లేకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు 'సాక్షి'లో ప్రచురితమైన వార్తలో ప్రస్తావించడంతో అధికారులు స్పందించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేయించగా, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్లకు ఇరువైపులా ముందుకు వచ్చిన షాపుల వారికి హెచ్చరికలు చేసి దారికి అడ్డుగా లేకుండా సరిచేయించారు.

ఈ- క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో త్వరితగతిన ఈ -క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని ఏఓ ఫణీశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకొని ఈ-కేవైసీ చేయిస్తేనే పంట నమోదు పూర్తయినట్లని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో ఈ -కేవైసీ రైతులు 8,470 మంది బుకింగ్ చేయించుకోవాల్సి ఉండగా 7028 మాత్రమే చేయించడం జరిగిందన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద ఈ కేవైసీ చేయించాలని సూచించారు.

రీసర్వేతో రైతులకు ప్రయోజనం

మహానంది: భూముల రీసర్వే ప్రక్రియతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తహసీల్దార్ జనార్దన్ శెట్టి తెలిపారు. బొల్లవరం, గోపవరం గ్రామాల్లో మంగళవారం రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సర్వేయర్లు రోవర్ల ద్వారా సర్వే చేస్తున్నారని, పకడ్బందీగా జరిగే సర్వే ద్వారా రైతుల భూములకు సంబంధించి అన్ని వివరాలు తెలుస్తాయన్నారు. సర్వేయర్లు వెంకటకృష్ణుడు, ఉసేనయ్య, పవన్, పార్థసారథి పాల్గొన్నారు.

అక్షరాస్యత కేంద్రాల ఏర్పాటు

ఆత్మకూరు: నంద్యాల జిల్లాలో నూతన అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ పీడీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అక్షరాస్యత కేంద్రాలు ఏర్పాటు చేసి అందులో ఇద్దరిని కౌన్సిలర్లుగా నియమిస్తామని చెప్పారు. విద్యతో పాటు బ్యాంకుల్లో జరిగే లావాదేవీలను వివరిస్తారన్నారు.

నేటి 'గడప గడపకు మన ప్రభుత్వం'

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బుధవారం నుంచి వేల్పనూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

పట్టణంలో పారిశుద్ధ్య పనులు

ఆత్మకూరు: పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలో ఇందిరానగర్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అన్ని కాలనీల్లో బ్లీచింగ్, సున్నం చల్లడమే కాకుండా అవసరం అయితే ఫాగింగ్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రాజగోపాల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టండి

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి చేపట్టనున్న ఇంటింటి సర్వేను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కడుమూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివకుమార్ గౌడు, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

రైతు భరోసా రిజిస్ట్రేషన్లు ప్రారంభం

వెలుగోడు: మండలంలో రైతు భరోసా పథకానికి అర్హత కలిగి ఉండి, ఇంతవరకు లబ్ధి పొందని వారు, కొత్త రైతులకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా 2023–2024 పోర్టల్‌లో కొత్త రైతుల వివరాలు అప్‌లోడ్ చేయడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని చెప్పారు. ఇప్పటివరకు సొంత భూమి ఉండి రైతు భరోసా పడని రైతులు, కొత్తగా పాస్ పుస్తకాలు చేయించుకున్న వారు రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

14న మండల స్థాయి క్రీడా పోటీలు

వెలుగోడు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ బాల బాలికల అండర్-14, అండర్-17 క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బ్రహ్మంనాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీల నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. క్రీడాకారులను మండల సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కే. ఓబులేసు, ఎం.సురేష్‌నాయుడు, రాంబాబు నేతృత్వంలో ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. జెడ్పీ స్కూల్ హెచ్ఎం సత్యనారాయణ, వేల్పనూరు హెచ్ఎం జి.రామలింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

వెలుగోడు: ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి వాదం నాగేషులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా నాయకులు ఆరోగ్యం, మండల కన్వీనర్ టి.వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటరమణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మహానంది: బసవాపురం గ్రామ సేవకుడు చిన్న ఓబులేసు అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జనార్దన్ శెట్టి మంగళవారం గ్రామానికి చేరుకుని ఓబులేసు కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ సురేంద్రనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ రామకృష్ణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలకు టెండర్ల ఆహ్వానం

నంద్యాలటౌన్: నంద్యాల జిల్లా పరిధిలోని ఆత్మకూరు, నందికొట్కూరు ఆర్టీసీ డిపోల్లో ఖాళీ స్థలములో వ్యాపార సముదాయాలు నిర్వహించుకోవడానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ పరిధిలో 242 చదరపు గజాల ఖాళీ స్థలము, నందికొట్కూరు బస్టాండ్ పరిధిలో 6287 చదరపు గజాల ఖాళీ స్థలమును 15 సంవత్సరాలు వ్యాపారం నిర్వహించుకోవడానికి ఆసక్తిగల వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. టెండర్లు వేయదలచిన వారు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కడప కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య బిడ్ సమర్పించవచ్చని తెలిపారు. ఈ టెండర్లకు సంబంధించి 15న ఆత్మకూరు, 16న నందికొట్కూరు డిపోలలో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్ చూడవలసినదిగా సూచించారు.

జగనన్నతోనే రైతన్నల సంక్షేమం

● జీవాలకు వ్యాక్సిన్లు
● ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నతోనే రైతన్నల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. రైతన్నల కోసం జగనన్న పశుబీమాను ప్రవేశపెట్టి 80శాతం సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. ఈ సబ్సిడీ అన్ని రకాల పశువులకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. అనంతరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తితో కలిసి జీవాలకు పారుడు వ్యాధి నివారణ టీకాలును వేయించి, జియో ట్యాగింగ్‌ను చేయించారు.

చట్టం అందరికీ సమానమే..

చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమేనని చట్టం ఎవరికీ చుట్టంకాదని ఎమ్మెల్యే అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే అరెస్టయ్యారని చెప్పారు. రాజకీయ కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా అరెస్టు చేసారని తెలుగుదేశంపార్టీ నాయకులు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్, రవిబాబు, పశు వైద్యులు నిర్మలాదేవి, షణ్ముఖరాజు, వీఎల్‌పీ అశ్వత్థయ్య, నాయకులు కాంతారెడ్డి, నాగభూషణంరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారుడువ్యాధితో జీవాలకు ప్రాణాపాయం

జూపాడుబంగ్లా: జీవాల యజమానులు అప్రమత్తం కాకపోతే పారుడువ్యాధితో జీవాలకు ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని జూపాడు బంగ్లా, తూడిచెర్ల గ్రామాల్లో జీవాలకు ఉచితంగా పారుడువ్యాధి నివారణ నిమిత్తం టీకాలు వేశారు. కార్యక్రమంలో పారుమంచాల వెటర్నరీ డాక్టర్ పావనిరెడ్డి, వైద్యసిబ్బంది నీలేశ్వరుడు, లైవ్‌స్టాక్ అసిస్టెంటు నవీన్‌కుమార్, సుమన్ పాల్గొన్నారు.

మహానంది: జీవాల ఆరోగ్యం పెంపకందారులకు మహాభాగ్యమని, పాడిపశువులు, జీవాలు ఆరోగ్యంగా ఉంటేనే యజమానులకు ఆర్థికంగా ఆదాయం చేకూరుతుందని మండల పశువైద్యాధికారి కరుణాకర్, తమ్మడపల్లె వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ జె.సులోచన తెలిపారు. తమ్మడపల్లెలో మంగళవారం జీవాలలో చీడపారుడు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పగిద్యాల: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు కలుషితమైనందున ప్రజలకు సరఫరాచేసే మంచినీటిని ప్రతి ఫిల్లింగ్‌కు క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ట్యాంక్‌లను శుభ్రం చేసిన, క్లోరినేషన్ చేసిన తేదీలను నోటీస్ బోర్డుల్లో నమోదు చేయాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ఎంక్వైరీకి 252 దరఖాస్తులు

కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్రం కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వరకు నిర్మితం కానున్న జాతీయ రహదారి 167-కే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల వద్ద నుంచి అవార్డు ఎంక్వైరీకి 252 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ మంగళవారం తెలిపారు. ఎన్‌హెచ్ 167-కేలో 528 మంది రైతుల వద్ద నుంచి 291 ఎకరాల భూమిని సేకరించామని తెలిపారు. ఇందులో 252 మంది నుంచి వారి భూములకు సంబంధించిన డాక్యుమెంట్ల అవార్డు ఎంక్వైరి చేశామని మిగత 276 మంది రైతులు ఎంక్వైరీకి రావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తియిన తర్వాత రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని వెల్లడించారు.

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

సామూహిక సుమంగళీపూజ



సుమంగళి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు మంగళవారం తంగడంచ సాయిబాబా దేవాలయ ఆవరణలో సామూహిక సుమంగళి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రాలను పఠిస్తుండగా మహామంగళ గౌరీదేవికి కుంకుమార్చన, పుష్పార్చన, మహామంగళహారతి వంటి విశేషపూజలను నిర్వహించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

మహానంది: బండిఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన హుసేన్ అలి(48) ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బండిఆత్మకూరుకు చెందిన హుసేన్ అలి భవననిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 7న మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగా డు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరు గైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు హుసేన్ అలికి భార్య ఫాతిమా, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాగుడుకు బానిసై..

నందికొట్కూరు: తాగుడుకు బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని బైరెడ్డి నగర్‌లో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రామి రెడ్డి తెలిపిన వివరాల మేరకు హుసేన్‌బాషా(53) తాగుడుకు బానిసై డబ్బులేక ఈనెల 10న ఫినాయి ల్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం వేకుజామున మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి భార్య శాలుబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జంప్‌రోప్ పోటీల్లో రాణించిన విద్యార్థులతో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సలీంబాషా



పతకాలు సాధించిన విద్యార్థినులతో కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి

మిడుతూరు: గుంటూరు జిల్లా తెనాలి స్టేడియంలో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో 10 మంది విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సలీంబాషా తెలిపారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్జున్ గోల్డ్ మెడల్, కాశీ విశ్వనాథ్ సిల్వర్ మెడల్, వి.జే సింధు, లక్ష్మీ ప్రసన్న, పుష్పావతి, మంజుల బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఊర్మిళను అభినందించారు. అలాగే కేజీబీవీ పాఠశాలకు చెందిన అర్షియాకు గోల్డ్‌మెడల్, మైథిలీ, సాయి తేజశ్వరిలకు సిల్వర్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్ఓ విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థినులకు, పీఈటీ సుమలతకు మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోవిందు, విజయభాస్కర్, విజయ్, అస్లాం పాల్గొన్నారు.

మంచినీటి బోర్ల ఫ్లషింగ్‌కు చర్యలు



కొణిదేల రస్తాలోని బోరు ఫ్లషింగ్‌ను ప్రారంభిస్తున్న డీఈ అమల

పగిద్యాల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొణిదేల రస్తాలో వేసిన మంచినీటి బోర్లను ఫ్లషింగ్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డివిజనల్ ఇంజినీర్ అమల తెలిపారు. మంగళవారం సాయంత్రం బోర్లను పరిశీలించిన ఆమె ఫ్లషింగ్ చేసేందుకు మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ గత వారం రోజులుగా మండలంలోని ఆంజనేయనగర్, బీరవోలు, పగిద్యాల గ్రామాల్లో అతిసారం కేసులు వెలుగు చూస్తున్నాయన్నారు. దీంతో పగిద్యాల పంచాయతీ పరిధిలోని సీడబ్ల్యూ పథకాల బోర్ల నుంచి నీటి సరఫరా నిలిపివేశామన్నారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు లేకుండా నందికొట్కూరు నుంచి మినరల్ వాటర్‌ను 12 ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయిస్తున్నామని వెల్లడించారు. మంచినీటి బోర్లన్నిటిని ఫ్లషింగ్ చేసిన అనంతరమే ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సచివాలయ కార్యదర్శి కోట్ల వెంకటేష్, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న తదితరులు ఉన్నారు.